క్లుప్తంగా

ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలి



సూరంపాలెంలో హాస్టల్ వద్ద విద్యార్థినులకు సూచనలిస్తున్న డీఎస్పీ, సీఐ

గండేపల్లి: విద్యార్థులు ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని పెద్దాపురం డీఎస్పీ పి.శ్రీహరిరాజు సూచించారు. మండలంలోని సూరంపాలెం, రామేశంపేటలోని లేడీస్ హాస్టళ్లను సోమవారం సీఐ వైఆర్కే శ్రీనివాస్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. మహిళల భద్రత, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. హాస్టళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గండేపల్లి ఎస్సై యువి శివ నాగబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అపార్ నమోదును వేగవంతం చేయాలి

రౌతులపూడి: ప్రతి విద్యార్థికి అపార్ నంబర్‌ను జనరేట్ చేయాలని ఎంపీడీఓ శివరామకృష్ణ సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం మండలంలోని ఆయా పాఠశాలల హెచ్ఎంలతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆధార్‌ను అనుసంధానం చేస్తూ విద్యార్థులందరికీ త్వరితగతిన అపార్‌ను నమోదు చేయాలని సూచించారు. గ్రామాల వారీగా అపార్ నమోదుపై ఎంఈఓ గాడి కొండబాబుతో సమీక్షించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.

ఆక్రమణలు తొలగించాలి

శంఖవరం: స్థానిక శ్మశాన వాటికలో ఆక్రమణలు తొలగించాలని కోరుతూ సామాజిక కార్యకర్త మేకల కృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ పోతురాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ శంఖవరంలో 139/1 సర్వే నంబర్‌లో ఎకరం 2.43 సెంట్ల భూమిలో శ్మశాన వాటిక ఉందన్నారు. ఈ స్థలం రోజురోజుకు ఆక్రమణలకు గురవుతుంది, దీనిపై గత సోమవారం గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఆక్రమణలు తొలగించాలని కోరారు.

ఉత్సాహంగా ఖోఖో పోటీలు

తుని: రోటరీక్లబ్ ఆధ్వర్యంలో రంగం యువజనోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక రాజా కళాశాల మైదానంలో నిర్వహించిన ఖోఖో పోటీలకు అనూహ్య స్పందన లభించింది. వివిధ పాఠశాలలకు చెందిన 30 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. శ్రీప్రకాష్ విద్యానికేతన్, పాయకరావుపేట ప్రథమ స్థానం సాధించగా, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, జగన్నాథగిరి పాఠశాలలు ద్వితీయ స్థానంలో నిలిచాలయని ప్రోగ్రాం కమిటీ చైర్మన్ టి.నాగిరెడ్డి తెలిపారు. తుని రోటరీక్లబ్ అధ్యక్షుడు మంగరాజు, కోశాధికారి కిశోర్‌రెడ్డి, నాగ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగిలో మెడికోవర్ హాస్పటల్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ అభిషేక్ 200 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది అభిలాష్, నాగేంద్ర, శివ శంకర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

జగ్గంపేట: స్థానిక మెరకవీధి రామలయం వద్ద అయ్యప్పభక్తులు సోమవారం పడిపూజ నిర్వహించారు. గురుస్వామి మామిళ్ల పల్లి రామకృష్ణ ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజ, కలశ పూజ నిర్వహించారు. అనంతరం గ్రామంలో స్వామివారి పల్లకీ సేవ జరిగింది. 108 కలశాలతో ఊరేగింపు నిర్వహించి ఆ జలాలతో స్వామి వారికి అభిషేకం చేశారు. మధ్యాహ్నం పేటతుళ్లి, రాత్రికి పడిపూజ నిర్వహించారు. కార్యక్రమాల్లో జిల్లా భారతీయ ధర్మ పరిషత్ అధ్యక్షుడు పాలచర్ల నాగేంద్ర చౌదరి, రావులమ్మ దేవస్థనం ధర్మకర్త జీను రాంబాబు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

నిందితుడికి రిమాండ్

గండేపల్లి: సారా కేసులో నిందితుడికి పెద్దాపురం కోర్టు రిమాండ్ విధించినట్టు స్థానిక సీఐ వైఆర్కే శ్రీనివాసరావు తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని కె.గోపాలపురానికి చెందిన జి అప్పన్న సారా తయారుచేస్తుండగా గండేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడిని పెద్దాపురం కోర్టుకు తరలించగా ఈ నెల 29 వరకు రిమాండ్ విధించడంతో సబ్ జైలుకు తరలించారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

గండేపల్లి: గ్రామాల్లోని లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ నాతి బుజ్జి సూచించారు. మండలంలోని సీలాద్రిరావుపేట, తాళ్లూరు గ్రామాల్లోని లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు డిసెంబర్ నెలాఖరుకు నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. గృహ నిర్మాణం పనులను వేగవంతం చేయాలని ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బి.రాంబాబు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

రబీసాగుకు సన్నద్ధం

- వ్యవసాయ బోర్ల పరిధిలో నారుమడులకు సన్నాహాలు
- చివరి దశకు చేరిన ఖరీఫ్ వరికోతలు
- పంపా ఆయకట్టుకు నీటి విడుదల లేదని ప్రకటించిన అధికారులు



రబీ వరినాట్లు వేసేందుకు పొలాలను దమ్ములు చేస్తున్న దృశ్యం

తొండంగి: మండలంలో వ్యవసాయ బోర్ల పరిధిలోని రైతులు రబీ వరిసాగుకు సన్నద్ధమవుతున్నారు. బెండపూడి, పి.ఇ.చిన్నాయపాలెం, గోపాలపట్నం, ఎ.కొత్తపల్లి, రావికంపాడు, కొమ్మనాపల్లి, సీతారాంపురం, శృంగవృక్షం, కృష్ణాపురం, పి.అగ్రహారం, కోదాడ ప్రాంతాల్లో దాదాపుగా 600 వ్యవసాయ బోర్లు ఉండగా 2500 ఎకరాల్లో రబీ సాగు జరుగుతోంది. ఆయా గ్రామాల్లో ఖరీఫ్ సాగు పనులు చివరి దశకు చేరుకోవడంతో రైతులు రబీ సాగుకు రెడీ అయ్యారు.

ముమ్మరంగా ఖరీఫ్ పంట ఒబ్బిడి పనులు

మండలంలోని పంపా, పీబీసీ ఆయకట్టు ప్రాంతాల్లో సాగునీటి లభ్యత ఉండటంతో రైతులు ముందుగానే వరినాట్లు వేశారు. ఈ మేరకు పంట కూడా మిగిలిన ప్రాంతాల కంటే ముందుగానే కోత దశకు చేరుకుంది. దీంతో బెండపూడి, కొమ్మనాపల్లి, రావికంపాడు తదితర ప్రాంతాల్లో రైతులు ఖరీఫ్ పంటలు కోత కోస్తున్నారు. ఖరీఫ్ అనంతరం రబీ సాగుకు ఇప్పటికే రైతులు నారుమడులు వేయడం, పంట పొలాలను దమ్ము చేయడం వంటి పనులు ప్రారంభించారు. మరో పది రోజుల్లో రబీ వరినాట్ల పనులు ప్రారంభం కానున్నాయి.

ఆయకట్టుకు నీటి విడుదల లేదు

మండలంలోని పంపా ఆయకట్టు పరిధిలో ఖరీఫ్‌లో దాదాపు 11,600 ఎకరాల్లో రైతులు వరిసాగు చేశారు. రబీలో సాగునీటి విడుదల ఉంటే ఆరువేల ఎకరాల వరకూ వరిసాగు జరిగేది. పంపా రిజర్వాయర్‌లో పుష్కర అక్విడెక్టు, మురికి కాలువ గేట్లు, కెనాల్ గేట్లు మరమ్మతుల పనులు తదితర కారణాలతో ఈ ఏడాది సాగునీటి విడుదల లేదని ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో పంపా ఆయకట్టు రైతులు ఈ ఏడాది అపరాల సాగుపైనే దృష్టి సారించాల్సి ఉంది.

పీబీసీ పరిధిలో సాగునీటి విడుదలపై స్పష్టత కరువు

మండలంలోని ఏవీ నగరం, కొమ్మనాపల్లి, సీతారాంపురం, కోదాడ, శృంగవృక్షంపేట ప్రాంతాలకు పీబీసీ ఆయకట్టు ద్వారా సాగునీరు విడుదవుతోంది. ఖరీఫ్‌లో రెండు వేల ఎకరాలకు పైగా సాగు జరుగుతుంది. రబీలో వెయ్యి నుంచి 1500 ఎకరాల వరకూ వరి పంట సాగు చేస్తారు. ఈ ఏడాది దీనిపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభంలో వరి పొలాలకు నీరందక పొలాలు ఎండిపోయాయి. అనంతరం వర్షాలు పడడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రస్తుతం రబీ సాగుపై అధికార, పాలక వర్గం నుంచి స్పష్టమైన హామీ లేకపోవడంతో రైతులు సందిగ్ధంలో ఉన్నారు.

అపరాల విత్తనాలకు ప్రతిపాదనలు పంపాం



పంపా ఆయకట్టు పరిధిలో పొలాలకు ఈ ఏడాది రబీ వరిసాగుకు నీటిని విడుదల చేయడం లేదని అధికారులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో దాదాపుగా నాలుగు వేల ఎకరాలకుపైగా అపరాల సాగు జరుగుతుందని అంచనా వేస్తున్నాం. రైతులకు అవసరమైన అపరాల విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మరో పది రోజుల్లో విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

–ఎస్.నరసింహం, వ్యవసాయశాఖాధికారి, తొండంగి

ఆక్రమణలు అడ్డుకోవాలని ఫిర్యాదు



ఏలేశ్వరంలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఏలేశ్వరం: పేదల కోసం గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన జగనన్న కాలనీలో ప్రభుత్వ భూమి ఆక్రమణను అడ్డుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకులు సోమవారం అధికారులకు ఫిర్యాదు చేశారు. స్థానిక తహసీల్దార్ ఆర్‌వీ వెంకటేశ్వరరావు, నగర పంచాయతీ కమిషనర్ ఎం. సత్యనారాయణకు ఆయా కార్యాలయాల్లో వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలకు సొంతింటి కలను సాకారం చేస్తూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పట్టణంలోని కప్పలచెరువు సమీపంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారన్నారు. ఈ మేరకు అప్పటి ప్రభుత్వం కేటాయించిన భూమిలో సుమారు పది సెంట్ల భూమిని భవన నిర్మాణ కార్మికులు అక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆ భూమిలో భవన నిర్మాణ కార్మికులు నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారన్నారు. దీనిపై అధికారులు వెంటనే స్పందించి స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, బదిరెడ్డి గోవిందు, సుంకర రాంబాబు, పైల విజయ్‌కుమార్, కోరాడ ప్రసాద్, వాగు బలరామ్, జువ్విన వీర్రాజు, సిరిపరపు రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం దేవస్థానం ఈఈగా నూకరత్నం

అన్నవరం: స్థానిక రత్నగిరి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (2)గా వి.నూకరత్నం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2023లో ఆమె ఇక్కడ నుంచి శ్రీకాళహస్తి దేవస్థానానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ద్వారకాతిరుమల దేవస్థానం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ఈఈగా పని చేస్తున్న మురళీ బాలకృష్ణను శ్రీశైలం దేవస్థానం ఈఓగా బదిలీ చేశారు.

ఈఓ పేషీ సూపరింటిండెంట్‌గా సత్యనారాయణమూర్తి

వ్రతాల విభాగం సూపరింటిండెంట్ కంచి సత్యనారాయణ మూర్తికి అదనంగా ఈఓ పేషీ సూపరింటిండెంట్ బాధ్యతలు అప్పగించారు. ఈఓ సీసీగా ఉన్న చిక్కాల సాయిబాబాను సన్నిధి గుమస్తాగా, వోలేటి జగన్నాథాన్ని సీఆర్వో గుమస్తాగా, పెన్నాడ వేంకటేశ్వరరావును పీఆర్వో గుమస్తాగా అంతర్గత బదిలీలు చేస్తూ ఈఓ రామచంద్రమోహన్ ఆదేశాలు ఇచ్చారు.

ఘన జీవామృతం తయారీపై అవగాహన

ప్రత్తిపాడు రూరల్: ఘన జీవామృతంతో పంటకు కావాల్సిన పోషకాలు పుష్కలంగా లభిస్తాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ ఎం.చిన్నబాబు అన్నారు. మండలంలోని ఒమ్మంగిలో రైతులకు సోమవారం ఘన జీవామృతం తయారీపై అవగాహన కల్పించారు. పంటల సాగులో ఘన జీవామృతం వినియోగించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వైపీ ముఖేష్, కె.రాజా, ఎం.రాజేష్, ఎం.లక్ష్మణస్వామి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తిక వనసమారాధనలు

- కార్తిక దామోదరునికి ప్రత్యేక పూజలు
- ఆటపాటలతో సందడి చేసిన యువత

రౌతులపూడి: కార్తిక మాసాన్ని పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వనసమారాధనలు నిర్వహించారు. ఎస్.పైడిపాలలో జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం ఆధ్వర్యంలో భారీ వనసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. ములగపూడిలో మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సీహెచ్‌వీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో కార్తిక వనసమారాధన నిర్వహించారు.

ఏలేశ్వరం: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం వనసమారాధనలు నిర్వహించారు. తిరుమాలిలోని మామిడితోటలో నిర్వహించిన వనసమారాధనకు వందలాది మంది హాజరయ్యారు. తూర్పులక్ష్మీపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద వనసమారాధన నిర్వహించారు. తొలుత వేంకటేశ్వరస్వామి, కార్తిక దామోదరునికి ప్రత్యేక పూజలు చేశారు. ఏలేశ్వరంలోని జగనన్న కాలనీలో భవన నిర్మాణ కార్మికుల ఆధ్వర్యంలో వనసమారాధన నిర్వహించారు.

ప్రత్తిపాడు: మండలంలోని లంపకలోవలో సోమవారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి వెంకటేష్ దంపతుల ఆధ్వర్యంలో ఈ వనసమారాధన ఏర్పాటు చేశారు. తొలుత ఉసిరి చెట్టు వద్ద కార్తిక దామోదరునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లంపకలోవ, పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.

కిర్లంపూడి: మండలంలోని కిర్లంపూడి ఉమా వైద్యనాథేశ్వరస్వామి, చిల్లంగి అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వ స్వామి ఆలయాల్లో సోమవారం వనసమారాధన నిర్వహించారు. యువ నాయకుడు ముద్రగడ గిరిబాబు, సిరి దంపతులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం సతీమణి పద్మావతి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి వనసమారాధనను ప్రారంభించారు. స్థానిక, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆయా అలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరం, ఒమ్మంగి గ్రామాల్లో సోమవారం కార్తిక వనసమారాధనలు నిర్వహించారు. ధర్మవరం–వెల్దుర్తి రోడ్డులోని మామిడి తోటలో గ్రామస్తులు, ఒమ్మంగిలో శివ కేశవ సాయి సత్సంగం ఆధ్వర్యంలో వనసమారాధనలు నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు భారీ ఎత్తున తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. యువత, మహిళలు ఆటపాటలతో సందడి చేశారు.



లంపకలోవలో కార్తిక దామోదరునికి పూజలు చేస్తున్న భక్తులు

కోడికత్తులు స్వాధీనం

గోకవరం: రానున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని జూదాలను అరికట్టే కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో కోడికత్తులు తయారు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నట్టు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు. ఎస్పీ నరసింహకిశోర్ ఆదేశాల మేరకు సోమవారం గోకవరంలో కోడికత్తులు తయారు చేస్తున్న అగర్తి రామబ్రహ్మం అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి కోడికత్తులు తయారు చేసేందుకు ఉపయోగించే రెండు మోటార్లు, 15 కోడికత్తులను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

800 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రత్తిపాడు: మండలంలోని పెద్దిపాలెం గ్రామ శివారులో సారా స్థావరాలపై సోమవారం పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 800 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ తెలిపారు. సారా తయారీ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో స్థానిక ఎక్సైజ్ ఎస్సై పి.వంశీరామ్, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



ఎ.కొత్తపల్లిలో ఎరువుల షాపులో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ దైవకుమార్

తొండంగి: రైతులకు ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పెద్దాపురం ఏడీఏ ఎస్.దైవకుమార్ హెచ్చరించారు. మండలంలోని ఎ.కొత్తపల్లిలో ఎరువుల షాపులను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లు, బిల్లుల రికార్డులు తనిఖీ చేసి సక్రమంగా నిర్వహించడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీ ధరల కంటే అధిక ధరలకు ఎరువులు విక్రయించినట్టు రైతుల నుంచి ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్దాపురం ఏఓ శ్రీనివాసరావు, తొండంగి ఏఓ ఎస్.నరసింహం, ఏఈవో కొప్పన దైవప్రసాద్ పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



జోనల్‌స్థాయి వాలీబాల్ విజేత జట్టును అభినందిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు

తుని రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల జోనల్ (జోన్–2) మీట్‌లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్టు లోవకొత్తూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పాఠశాల ప్రిన్సిపాల్ కనిగిరి విశ్వేశ్వరరావు సోమవారం తెలిపారు. మూడు జిల్లాల జోనల్ ఆటల పోటీలు ఈ నెల 14 నుంచి 16 వరకు కృష్ణా జిల్లాలో జరిగాయన్నారు. వాలీబాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి ప్రథయ స్థానం సాధించారన్నారు. ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకున్న విద్యార్థులను, కోచ్, వ్యాయామ ఉపాధ్యాయులు పి.మరిడియ్య, వై.రాములను జిల్లా డీసీఓ జి.వెంకట్రావు, ప్రిన్సిపాల్ విశ్వేశ్వరరావు అభినందించారు.

డోనార్ కాటేజీ స్కీంకు రూ.2,01,101 విరాళం

అన్నవరం: అన్నవరం దేవస్థానంలోని సత్యగిరిపై గల శివసదన్ సత్రంలో రూమ్‌కు సత్రం డోనార్ స్కీం కింద హైదరాబాద్‌కు చెందిన లింగ శార్తిక్ రూ.2,01,101 విరాళాన్ని సోమవారం అడ్వాన్స్‌గా సమర్పించారు. మిగిలిన రూ.8 లక్షలు తర్వాత పంపిస్తానని దాత చెప్పినట్లు అధికారులు తెలిపారు.

అవకతవకలపై ఫిర్యాదు

ప్రత్తిపాడు: పంట నష్ట పరిహారంలో అధికారులు అవకతవకలకు పాల్పడ్డారని మండలంలోని పెదశంకర్లపూడి గ్రామానికి రైతులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పెదశంకర్లపూడిలో సుబ్బారెడ్డి సాగర్ నుంచి వెంకన్న దొర చెరువు వరకు 700 ఎకరాలు, చెరువు నుంచి నాగులకొండ వరకు 200 ఎకరాల ఆయకట్టు పరిధిలో పంట పొలాలు ఇటీవల సంభవించిన తుపాన్‌కు దెబ్బతిన్నాయని తెలిపారు. అయినప్పటికీ గ్రామంలో రైతులకు నష్ట పరిహారం అందలేదని, దీనిపై విచారణ జరపాలని కోరారు. కార్యక్రమంలో రైతులు రాసంశెట్టి రాజా, ఆర్ ధర్మరాజు, దశ రామారావు, కర్రి మరిడియ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల పర్యటన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ధర్మవరంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్ సోమవారం పర్యటించారు. పార్టీ మండల ఉపాధ్యక్షుడు ఊట వీరబాబుతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి అందుతున్న రుణాలు, ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నానిపల్లి శ్రీనివాస్, గోపి, అబ్బులు, దండ వీరబాబు, గవర వీరబాబు, వీఓఏలు పాల్గొన్నారు.

ప్రజాహక్కుల సభను విజయవంతం చేయాలి

జగ్గంపేట: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా విజయవాడలో వచ్చే నెల 4న నిర్వహించే ప్రజా హక్కుల సభను విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి ఏగుపాటి అర్జునరావు కోరారు. ఈ మేరకు సోమవారం జగ్గంపేటలో సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ ఆధ్వర్యంలో ప్రచార ర్యాలీ నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయలేదని విమర్శించారు. కార్యక్రమంలో జక్కంపూడి రాజు, నాగులపల్లి రమణ, రొబ్బుల శంకరమ్మ పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణతో రక్షణ

కోటనందూరు: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్‌ను ధరించడం ద్వారా ప్రాణాలకు రక్షణ లభిస్తుందని స్థానిక ఎస్సై టి.రామకృష్ణ అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్ వద్ద సోమవారం హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడిపే వాహనదారులను ఆపి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం మంచిది కాదన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం, రోడ్డు నిబంధనలు పాటించడం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చెట్ల ఫలసాయానికి రేపు బహిరంగ వేలం

తుని రూరల్: మండలంలోని తేటగుంట సమీపంలో ఉన్న ప్రభుత్వ ఉద్యాన క్షేత్రంలో చెట్ల ఫలసాయానికి బుధవారం బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు ఉద్యాన అధికారి వెన్నెల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కాకినాడ జిల్లా ఉద్యాన అధికారి ఎస్.మల్లికార్జునరావు పర్యవేక్షణలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు చెప్పారు. 17 ఎకరాల్లో విస్తరించి ఉన్న 335 మామిడి, 140 జీడి మామిడి, 97 సపోటా, 156 జామ, 135 కొబ్బరి, మూడు ఉసరి, రెండు పనస, ఐదు వెలగ, 14 చింత చెట్ల నుంచి హెచ్చు వేలందారుడు సంవత్సరం ఫలసాయం పొందవచ్చన్నారు. ఆ రోజు ఉదయం తొమ్మిది గంటలకు ఉద్యాన క్షేత్రం ఆవరణలో బహిరంగ వేలం ప్రారంభమవుతుందని, ఆసక్తి గల వారు పది గంటల లోపు రూ.10 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వేలం దక్కించుకున్న వ్యక్తి అదే రోజు పూర్తి సొమ్ము చెల్లించాలని తెలిపారు.

శంభో శంకర.. హరహర మహాదేవ

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- స్వామివారికి విశేష పూజలు

తుని/ఏలేశ్వరం/కోటనందూరు/తొండంగి/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/తుని రూరల్/జగ్గంపేట/గోకవరం/గండేపల్లి: కార్తిక మాసంలో మూడో సోమవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని ఆలయాలు వేలాది మంది భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. తుని కత్రాళ్లకొండ తాండవ నదిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి ముక్కంటిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. పట్టణంలోని పెద్దవీధి, గవరపేట శివాలయాల్లో ధ్వజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలగించి పూజలు చేశారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు.

ఏలేశ్వరంలో..

ఏలేశ్వరం పట్టణంలోని రాజరాజేశ్వరి సమేత రామలింగేశ్వరాస్వామి ఆలయంలో అర్చకులు శేఖర్, మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఏలేశ్వరం మండలంలోని లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లోని శివాలయాలు అయ్యప్ప స్వాములు, మహిళలు, భక్తులతో నిండిపోయాయి. ఆలయాల్లోని ధ్వజస్తంభాల వద్ద మహిళలు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు.

రౌతులపూడి మండలంలో...

రౌతులపూడి మండలంలోని శృంగవరం–మెరక చామవరం సమీపంలో నందనవనంలో వెలసిన ఉమా వర్ధినీ నాగలింగేశ్వరస్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి ఆలయ ప్రాంగణంలోని కోనేరులో పవిత్ర స్నానాలు ఆచరించారు. స్వామి, వార్లను దర్శించుకొని అర్చనలు, పూజలు చేశారు.

కోటనందూరు, తొండంగి మండలాల్లో..

కోటనందూరు మండలం బొద్దవరంలో వేంచేసిన గౌరీకాశీజ్ఞానేశ్వరస్వామిని వైఎస్సార్ సీపీ నాయకుడు యనమల కృష్ణుడు తదితరులు దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. బొద్దవరం, కోటనందూరు, అల్లిపూడి శివాలయాల వద్ద భారీఅన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. తొండంగి రామలింగేశ్వర స్వామి ఆలయంలో పంచామృతాభిషేకాలు, లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఒంటిమామిడి విశ్వేశ్వరాలయం, అద్దరిపేట, పంపాదిపేట, పైడికొండ, శృంగవృక్షం, ఎ.కొత్తపల్లి, బెండపూడి గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రత్తిపాడు మండలంలో...

ప్రత్తిపాడు మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. పండితులు స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష పుష్పార్చన, విశేష పూజలు నిర్వహించారు. ధారపల్లి, ఎరకంపాలెం జలపాతాలకు భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి వారి పంచాయతన ఆలయం భక్తులతో నిండిపోయింది. ఆలయ ప్రధానార్చకుడు కొత్తలంక సాయి ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, సామూహిక అభిషేకాలు నిర్వహించారు.

జగ్గంపేట, గండేపల్లి, గోకవరం మండలాల్లో..

జగ్గంపేటలో వేంచేసిన చంద్రశేఖరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారిని పూలతో సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. గండేపల్లి మండలంలోని నీలాద్రిరావుపేట, జెడ్.రాగంపేట, తాళ్లూరు, మల్లేపల్లి, గండేపల్లి, మురారి, యల్లమిల్లి గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మల్లేపల్లిలో సత్యమాలను ధరించిన దీక్షాపరులు, గ్రామస్తులు నగర సంకీర్తన నిర్వహించారు. గోకవరం మండలంలోని శివాలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. గోకవరంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలో కోనేటిలో కార్తిక దీపాలు విడిచిపెట్టారు. కొత్తపల్లిలో రెడ్డిరాజుల కాలం నాటి బాలత్రిపుర సుందరీ సమేత రాజలింగేశ్వర స్వామి ఆలయానికి భారీగా భక్తులు తరలివచ్చి పూజలు చేశారు.



బొద్దవరంలో శివలింగానికి పూజలు చేస్తున్న యనమల కృష్ణుడు తదితరులు



ఒంటిమామిడిలో స్వామివారికి అభిషేకాలు



రాచపల్లిలో విశేష అలంకరణలో స్వామివారు



ఏలేశ్వరం శివాలయంలోని ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



రౌతులపూడి మండలం నందనవనం నాగలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు